

# అర్థంకానిది ఏదో...

డిఎస్పీ ఇంటలిజెన్స్ నరహరి ఉలిక్కిపడి మేల్కొన్నాడు. చటుక్కున రాత్రినుండి వెంటాడుతున్న కల మనసులో మెదిలింది.

టైం చూశాడు..ఐదూ పది.

పరమ వికారమైన బొంతపురుగు అందమైన సీతాకోక చిలుకగా మారడం నిజంగా ఎంత అద్భుతం.

కలలో..గండు బొంతపురుగు..చేయంత దొడ్డు..ఒంటినిండా వెంట్రుకలు..వికృతమైన నలుపురంగు..ప్రాకుతూ వికారమైన కదలిక..

అదే కల..చటుక్కున మెలకువ..మగత..మళ్ళీ నిద్ర..మళ్ళీ మెలకువ..ఇదే రాత్రంతా,

ఇంతకుముందు మెలకువ వచ్చేప్పుడే..బొంతపురుగు చూస్తూ చూస్తూండగానే క్రమక్రమంగా రంగురంగుల సీతాకోకచిలుకగా మారింది..పెద్ద సీతాకోకచిలుక..చిలుకంత సైజ్..మారి బొంతపురుగు

అవశేషాల్నుండి ఎగిరి ఎటో ఆకాశంలోకి అంతర్ధానమైపోయింది.

ఒక వికృతి..అందంగా మారడం,

ఒక జీవి మరో జీవిగా రూపాంతరం చెందడం,

ఒక సత్యం అసత్యంగా పరిణామం చెందడం..వ్,

ఐతే ఒక సీతాకోకచిలుక పునఃరూపాంతరం చెంది మళ్ళీ బొంతపురుగుగా మారుతుందా? మారదు..ఎందుకు..?

ఎందుకో నరహరికి చటుక్కున భయమై ముచ్చెమటలు పోశాయి.

ఒక కానిస్టేబుల్‌గా సర్వీస్‌లో చేరిన తను..బొంతపురుగు వంటి తను..క్రమంగా క్రమంగా మెట్లెక్కుతూ ఎక్కుతూ చాన్నాళ్ళ క్రితమే ఎస్సైఐ, సి.ఐ ఐ, డిఎస్పీ ఐ..సీతాకోక చిలుకగా మారాడు కదా..ఇక సీతాకోక చిలుక ఎన్నడూ తిరిగి బొంతపురుగుగా మారదు కదా..!

హమ్మయ్య -

నరహరి అసహనంగా వెన్నెలముద్దవంటి బెడ్‌పై దొర్లాడు..ఎ.సి తనముందు చేతులు కట్టుకుని, తలవంచుకుని వినమ్రంగా నిలబడ్డ పేద కానిస్టేబుల్‌లా నిశ్శబ్దంగా పనిచేస్తోంది.

కానిస్టేబుల్‌గా తను ఉద్యోగంలో చేరిననాడు ఒక సత్యం తెలిసింది. ఖాకీ బట్టలవల్ల..పోలీస్‌స్టేషన్ బయట జనం ముందు తను పులి..లోపల ఆఫీసర్ల దగ్గర తను కుక్క అని.

ఆ క్షణం నుండే లోపల ఒకటిగా జీవించడం..బయట మరొకటిగా జీవించడం..వెరసి చాలా రకాలుగా జీవిస్తూ, అనేక రకాలుగా మరణించడం అలవాటైంది నరహరికి.

నీతి తప్పితే డబ్బును ఎంత సులువుగా సంపాదించవచ్చో..అధికారంతో ఎంత ఆనందకరంగా మనుషుల్ని హింసించవచ్చో.. పోలీస్ వృత్తిలో కొద్దిమందికి కొద్దిసేపు బానిసగా ప్రవర్తించినా ఎంత విచ్చలవిడిగా సర్వసుఖాలనూ అనుభవించవచ్చో నరహరి నిచ్చెన మెట్లు ఎక్కుతున్న క్రమంలో గ్రహించాడు.

ప్రపంచంలో 'స్తుతి'కి లొంగనివాడెవడూ ఉండడని నరహరికి అనుభవంతో అర్థమైంది.

చేతులను విదిలించి, తన సుశితమైన తెలివిని పదునుపెట్టుకుని, సరియైన సమయంలో సరియైన వ్యక్తుల పంచన చేరి, సరియైన పైరవీలు చేసి విడిచిన బాణంలా ఎలా దూసుకుపోవాలో నరహరి తెలుసుకున్నాడు.

అవినీతికరమైన ఆలోచనల్తో డబ్బు..డబ్బుతో సుఖాలు..డబ్బుతో ప్రమోషన్లు..ప్రమోషన్లతో అధికారం..అధికారంతో అహంకారం...అహంకారమే ఒంటినిండా మదమెక్కించే అలంకారం ఐ-

డబ్బు సంపాదించడం ఇంత సులువా-

నిక్కి నిలబడ్తే ప్రపంచం ఇంత సునాయాసంగా పాదాక్రాంతమౌతుందా-

అందమైన అప్సరసవంటి "స్త్రీ" ఇంత అల్కగా వశమౌతుందా.

మనుషులు ఇంత సులువుగా 'జీ హుజూర్' అని లొంగిపోతారా..అని నరహరి బాగా తాగి ఊపులో ఉన్నపుడు ఎన్నోసార్లనుకుని ఆశ్చర్యపోయాడు.

చటుక్కున తను ఇప్పుడు ఏ 'స్త్రీ' ఇంట్లో ఉన్నాడోననే అనుమానం పొటమరించింది నరహరికి.

దిక్కున లేచి కూర్చున్నాడు.

ఇది తన ధర్మపత్ని అంజలి ఇల్లే...అధర్మపత్నులు ముగ్గురు వెంటనే మెరుపుల్లా జ్ఞాపకమొచ్చారు. చిత్ర, పంకజం, ఎలిజబెత్. అందరికీ సకల సౌకర్యాలున్న ఇండ్లు. ఎవరి స్థావరాల్లో వాళ్ళు.

నరహరికి ఎందుకో కృష్ణుడు జ్ఞాపకమొచ్చాడు. ఎనిమిదిమందితో ఎలా టైమింగ్స్ మేనేజ్ చేసుకున్నాడో పాపం అని జాలేసింది.

రాత్రి తాగిన గోల్డ్ లేబుల్ విస్కీ కిక్ దిగుతున్నట్టనిపిస్తూనే..నరహరికి ఒకసారి తన డబ్బు దాస్కున్న స్థావరాలు స్ఫురణకొచ్చేయి ఎందుకో. కార్పొరేషన్ బ్యాంక్ లాకర్లో ఐదు సంవత్సరాల క్రితం కుక్కి కుక్కిపెట్టిన వేయిరూపాయల కట్టలు జ్ఞాపకమొచ్చాయి. నోట్లన్నీ చీకిపోయి ఉంటాయా ఇప్పుడు..చూస్కోవాలి ఒకసారి. అసలా లాకర్ కీ ఎక్కడుంది.. ఎలిజబెత్ ఇంట్లోని బాత్రూం సబ్బుపెట్టె టైల్ వెనుక కదా. ఎస్‌బిహెచ్ లాకర్లో ఎన్నో ఎకరాల భూమి తాలూకు డాక్యుమెంట్స్. ఐసిఐసిఐ లాకర్లో ఎనిమిది కిలోల బంగారం. పద్దెనిమిది బ్యాంకుల్లోని రెండున్నర కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్ కాగితాలు పంకజం తమ్ముని కీప్ ఇంట్లో..ఏమిటో..ఎక్కడెక్కడో..ఎంతెంతో..ఏమిటిదంతా-

డబ్బు కంపు..జీవితమంటే డబ్బేనా. లేక డబ్బే జీవితమా..కాదు. కాదని చాలా స్పష్టంగా తెలుసు తనకు..ఐతే.,

ఐతే దగ్గరే ఆగి..స్తబ్ధించిపోతోంది అంతా..ప్చ్. పోనీ,

నరహరికి అప్పుడప్పుడు అతి సాధారణంగా, సాదాసీదా మామూలు మనిషిలా..చెప్పాలంటే ఒక పేద కుటుంబీకునిలా జీవించాలనిపిస్తుంది.. మొహమొత్తి..జస్ట్ ఫర్ ది సేకాఫ్ చేంజ్..ముకేష్ అంబానీకి రోడ్డుపై టీ బండిమీది ఛాయ్ తాగాలనిపిస్తుందట..అలా.

చటుక్కున నరహరికి గతవారమే తన నెలల కొడుకుని తీస్కొని అమెరికానుండి తనింటికొచ్చిన కూతురు కమల గుర్తొచ్చింది.

రాత్రి భోజనాలు చేస్తున్నప్పుడు కమల గారాలు పోతూ.."డాడీ రేపు సండేగదా..మంచి బోటీ, తలకాయకూర తెప్పిస్తావా..అమెరికాలో అవస్సలు దొర్కనే దొర్కవు" అని అన్న విషయం జ్ఞాపకమొచ్చింది.

ఐతే ఈ ఒక్కరోజు సాధారణంగా జీవిస్తే పోలా..అనుకుని.. బాత్‌రూంలోకి జొరబడి..కమోడ్‌పై కూర్చుని దొడ్డికిపోతూ..మళ్ళీ రహస్య ఆస్తుల వివరాలను రోజులాగానే ఒకసారి మననం చేసుకుని..వచ్చి..వాకింగ్ డ్రెస్ వేసుకుని-

తెల్లవారింది.. ఎండాకాలం..చల్లగా..ప్రశాంతంగా, ఆహ్లాదంగా..

ఇంటిముందు తోట.. పూలచెట్లు.. ఎనిమిది వందల గజాల్లో..అందమైన ఇల్లు. ఎవడో ఓ రిఆల్టర్ ఏదో ఫోర్జరీ కేసులో ఇరుక్కుని బయట పడేందుకు లంచంకింద కట్టించి ఇచ్చిన ఇల్లు.

కార్ బయటకు తీశాడు నరహరి..రోడ్డుపై ఇనుప పలకమీద గాజుగోలీలా కారు పరుగు..ఐదు నిముషాల్లో కాకతీయ మెడికల్ కాలేజి గేట్లోకి ప్రవేశించి..ఆంధ్రాబ్యాంక్ ముందు కారుని పార్క్ చేసి..

టైం చూచుకున్నాడు - సరిగ్గా ఆరు.

నడక ప్రారంభిస్తూ...పంకజానికి ఫోన్ చేశాడు..కారుతున్న ప్రేమతో వగలొలికే పలకరింత.

ఈ పెళ్ళాలూ, పిల్లలూ తను సమకూర్చే ఈ సర్వసౌఖ్యాలనూ ఉపసంహరించుకుని వీళ్ళను 'పాపర్' జోన్‌లో నిలబడ్తే..తనను ఇలా పలకరిస్తారా.. ప్రేమను ఒలకపోస్తారా..అసలు కన్నెత్తి చూస్తారా..బొంతపురుగును చూచినట్టు చూడరా.

బొంతపురుగు..బొంతపురుగు..మళ్ళీ బొంతపురుగు..స్పృహ. ఛీ ఛీ.. వికారమైన కల..వికృతమైన జ్ఞాపకం.

నడుస్తున్నాడు నరహరి..బ్రిస్క్ వాకింగ్..రిస్క్ వాకింగ్.

స్టాఫ్ క్వార్టర్స్, లేడీస్ హాస్టల్, లక్కిరెడ్డి బ్లాక్..రౌండ్ గ్రౌండ్..వేప చెట్టుక్రింద నిలబడి..ఒక భావశూన్యమైన చూపు.

ఎవరెవరో జట్లు జట్లుగా నడుస్తూ...

మనుషులు ఒక సమూహంగా నడవడం నిజంగా ఎంత బాగుంటుంది.

'మనుషులు కలువడమే కవిత్వం కదా'..ఎక్కడో సభలో మొన్న ఎవరో కవి అన్నాడు. నిజమేగదా..

గ్రౌండ్‌లోకి నడుస్తూ..చిత్రకు ఫోన్ కలిపాడు. చిత్ర ఎమ్మే గోల్డ్‌మెడలిస్ట్. కాని జీవితమంటే కేవలం ఆనందంగా జీవించడమేనని నిర్వచిస్తుంది. అందుకే కట్టుకున్న గుమాస్తా భర్తను వదిలేసి తనతో లేచివచ్చి కోటి రూపాయల ఎఫ్‌డీలతో హాయిగా ఉంది.

నవ్వుకుంటూ..సెల్ ఫోన్లో సంభాషిస్తూ..నడుస్తూ..ఒకటవ రౌండ్.. రెండవ రౌండ్..ఎనిమిదవ రౌండ్-

ఒళ్ళంతా చెమటతో తడిచి..చల్లగా గాలి..తల్లి స్పర్శవలె-

తిరుగు ముఖం పద్మా..నడక..న్యూ మెన్స్ హాస్టల్, ఆడిటోరియం, రాయుడు బ్లాక్..

ధర్మపత్ని అంజలికి ఫోన్ చేశాడు నరహరి.

అమెరికా అమ్మాయి..బోటి, తలకాయ కూర కావాలన్న సంగతి చెప్పి వచ్చేప్పుడు తెమ్మంది.

'ఇక ఇప్పుడు సామాన్యునిగా జీవిద్దాం' అనుకుని కారుని కెఎమ్‌సి నుండి ఎల్లంబజార్‌వైపు పోనిచ్చాడు నరహరి. తను చిన్నప్పటినుండి ఎరిగిన ఎల్లంబజార్..బట్టల దుకాన్లో గుమస్తాగా పనిచేసే నాన్న అష్టదరిద్రాలనూ అనుభవిస్తూ తమను పెంచుతున్నప్పుడు బోటికోసం ఎప్పుడూ తను నాన్నతో వెళ్ళిన ఎల్లంబజార్..,

కారుని ఒక తోళ్ళ దుకాణం మూలపై ఆపి..దిగి..నడుస్తూ,

సన్నని కూలిన గోడ సందులోనుండి లోపలికి అడుగుపెట్టి...రెండు వైపులా అన్నీ మాంసం దుకాణాలు...'సార్...సార్...ఏంకావాల్సార్' పిలుపులు.

ఒక గద్దెపై...అతను నందు...తెలుసు తనకు...తనెవరో అతనికి తెలియదు.

"నందూ...అచ్చా బోటీ దేతే..."

'క్యాం నహీ...లేవ్‌సాబ్...ల్యాత బోటి...కెత్‌నే....'

'దొ కిలో'

'ఏ..లే...' ఒక ప్లాస్టిక్ సంచీలో వేశాడు పేగులు, బొంత... కొవ్వు.... పెద్దపేగులు...గొట్టం, దొబ్బ.

'ఏ మొండీ ఔర్ చార్ పావ్ కైసే'

"ఏక్‌సౌ పచాస్"

'కాపుడు'

'నేనే కాపి కొట్టిస్త'

'అచ్చా దేవ్...లేతదియ్యి...మా అమెరికా పిల్ల ఖాయిష్ పడింది తల్‌కాయకూర తినాల్నని'

'ఏ..లేసాబ్...అరే యాకూబ్...ఇదరారే...ఏ మొండీ ఔర్ చార్ పావ్ సాబ్‌కా జల్దీ సాఫ్‌కర్కేలా..బాగ్..'

పదహారేండ్లుటయ్ కావచ్చు యాకూబ్‌కు. మెరుపులా తలకాయ, కాళ్ళను తీస్కొని లోపలికి పరుగుపెట్టి మాయమైండు.

'మీరు ఎంబడి పోండ్సార్ లేకుంటె లేటైతది'

నరహరి లోపలికి వెళ్ళాడు. అటుపక్క చేపల లక్ష్మి గంప దగ్గర పెద్ద గుంపు. ఆమె చేపలను జోకి క్రింద పొయ్యగానే ఎగబడి తీస్కొని క్లీన్ చేసే మనుషులు....నాకంటే నాకని కొట్లాట.

నరహరి గలీజ్‌గా ఉన్న మోరీని, పొర్లి ప్రవహిస్తున్న మురుగు నీటిని దాటి గంతులేస్కుంట...వరుసగా నాల్గు అడ్డాలు...తలకాయలు కాపేటానికి...అన్నీ బిజీ. రెండింట్లో ఎవరో ఆడవాళ్ళు కాపుతున్నారు. మరోరెండిట్లో మగాళ్ళు..ఒకాదాంట్లో ముసలాయన.....గడ్డంతో సాయెబు...యాకూబ్ తను కొన్న పొటేల్ తలకాయను నిలబెట్టి ఒక ఇనుపరాడ్‌ను ముక్కులోగుచ్చి నేలకేసి గుద్ది బ్లోయర్‌ను తిప్పుకుంటూ కుంపటిపై తలలను కాలుస్తున్న వ్యక్తికిచ్చాడు.

అప్పుడు చూశాడు నరహరి...ఆ మనిషిని....మెరుపులా పనిచేస్తున్నాడు. నోట్లో గుట్కాతోసహా జర్దా పాన్. మెడలో ముడివేస్కున్న ఆకుపచ్చని గుడ్డ. నెత్తిపై సగం టోపి బోర్లించి, పైకి మడచిన చేతుల పాత కమీజ్...ఇరవై రెండేండ్లుంటాయేమో..

అప్పటికే ఏడెనిమిది తల్కాయలకు రాడ్స్ బిగించి ఉంచాడు యాకూబ్.

నరహరిని చూచి..అరే జాఫర్‌మియా – ఏ సాబ్‌కా ఏ మొండీ, ఏ చార్ పావ్ జల్దీకరో..ఏ లే' అని ఒకటి జాఫర్ ముందుకు జరిపి.,

జాఫర్ సమాధిలోనుండి కళ్ళు విప్పినట్టు తలెత్తి నరహరిని చూచి.. తన బాపతు పొటేలు తలను నిప్పులపై సర్దిపెట్టి, నాలుగు కాళ్ళను ప్రక్కలకు అటు ఇటూ జొప్పించి...

'ఏ లేరే...ఇస్కో పానీ మే డాల్కే సాఫ్ కర్'.. కాలిన పొటేల్ కాళ్ళను విసిరాడు జాఫర్.

అటు బ్లోయర్ చప్పుడు..ఎదుట ఎర్రగా నిప్పు..పొగ...బూడిద... చుట్టంతా కమురు వాసన..మనుషుల కోలాహలం..మాటలు కలగలిసిపోతున్న రొద..జీవవంతమైన నిజమైన ప్రపంచం..ఎంత బాగుందో.

'కెత్నే పైసే లేతే మియా ఏక్ మొండికో' నరహరి ప్రక్కన నిలబడ్డ వ్యక్తి అడుగుతున్నాడు.

'బీస్ రూప్యే..'

'కెత్నే దేర్ లగ్‌తా..'

'బస్ దస్ మినట్'

'ఏలేరే సాలే.. ఏ చార్ పావ్ పానీమే డాల్కేదో..జల్దీ' యాకూబ్ ఓ కుంటివాడికి పురమాయిస్తున్నాడు పనిని. వాడు కుంటూతూ ఓ పెయింట్ బకెట్లో ఉన్న నల్లని నీళ్ళలో కాల్చిన కాళ్ళను చుఁయ్‌మని ముంచి..లొడపెట్టి..బయటికి ఒక్కొక్కటి తీసి..ఒక రేకు పట్టీతో గీకి..నల్లగా, చిక్కగా మసి.,

యాకూబ్..కాల్చిన కాళ్ళగిట్టలను సుత్తెతో కొట్టి ఊడదీస్తున్నాడు. అంతా ఏదో ఒక బిజీ సంరంభం..శ్రమ సౌందర్యం.

'కితనేమే లియే సార్' ప్రక్కనున్న అతను నరహరిని అడిగాడు.

'ఏక్ సౌ పచాస్'

'మై కుమార్‌పల్లి హనమ్‌కొండాసే లాయా..బడేబీహై..ఏక్ సౌ బీస్'

'అబ్బా..అరే ఆ నందుగాడు మోసం చేసిండు..నూటా యాభై తీస్కున్నడు నాదగ్గర'

'అరే సాబ్..మోసమేమున్నది. ఏక్ సౌ బీస్..యహా జలానేకో బీస్..హనంకొండ జానే ఆనే బీస్ పెట్రోల్..కెత్నే హువా..' యాకూబ్.. కాల్చిన పొటేల్ తల మసిని గీక్కుంటూనే అని..'సార్..మోసం..గీ లోక్లాస్‌లుండది. బడేలోగ్ కర్తే చీటింగ్ జ్యాదా..!' అన్నాడు.

'ఔ మియా..ఠీక్ బోలా తు' అని ప్రక్కనున్నాయన.,

'అరేసార్..రామలింగరాజు పదివేల కోట్లు ముంచుతడు, తెల్గీగాడు ముప్పయ్ వేల కోట్లు ముంచుతడు, లల్లూ గడ్డితిని మూడువందల కోట్లు ముంచుతడు..సర్కార్ భూముల్నమ్ముకొని కార్పొరేట్ సాలెగాండ్లు వందల కోట్లు తింటరు..ఈ దేశాన్కి వాళ్ళు సార్ ద్రోహులు..హరామ్ జ్యాదే..' అంటున్నాడు యాకూబ్

'క్యా పడే మియా తుమ్'

'పడాయికా క్యా జరూరతహైసాబ్..ఏ దునియాకో పడ్‌నేకే వాస్తే ఆద్మీ బస్ ఆద్మీ హోనా సాబ్..ఆద్మీ జాన్వర్ నైహోనా..'

యాకూబ్ చెబ్తూనే ఉన్నాడు..గడగడా.

ఎందుకో చటుక్కున నిప్పుల్లో మేక తలను కాలుస్తున్న జాఫర్ ప్రశంసాపూర్వకంగా యాకూబ్ దిక్కు చూశాడు చిర్నవ్వుతో..అతని కన్నుల్లో నిప్పుల వెలుగు ప్రతిఫలిస్తోంది.

నరహరికి ఎందుకో..ఎక్కడో..ఏదో లోతుగా గుచ్చుకున్నట్టయింది.

అప్పుడు నరహరికి..ఆ నిప్పుల పొయ్యి వెనుక యిటుక గూట్లో ఉన్న దొడ్డు పుస్తకం కనబడింది..ఎవరిదది..వీళ్ళదేనా..వీళ్ళు పుస్తకాలను కూడా చదువుతారా.

ఎవరో గుండెలను పిండుతున్నట్లనిపించి..మళ్ళీ బొంతపురుగు జ్ఞాపకమొచ్చి..యాకూబ్ తనలోకే ఆ ఇనుప రాడ్‌ను గుచ్చుతున్న వికారమైన భయంతో నిండిన అనుభూతి కలిగి..నరహరి అప్రయత్నంగానే "దీజ్ పీపుల్ డు నాట్ నొ ద ఇంపార్టన్సాఫ్ మనీ...దె డోన్ట్ నొ హౌ టు లివ్" అన్నాడు గడగడా.

గాయపడ్డ బెబ్బులిలా తలెత్తి చూశాడు జాఫర్. చూచి 'సమ్ పీపుల్ డై ఏజ్ దె లివ్..అండ్ సమ్ పీపుల్ లివ్ ఈవెనాఫ్టర్ దె డై..సర్..జీవించడం ఒక కళ..మనిషి దేశం కోసం జీవించాలి. మనిషి సమాజంకోసం జీవించాలి. పశువు తనకోసం తను జీవిస్తుంది...ఆద్మీ షాన్‌సే జీనా...ఔర్ షాన్‌సే మర్నా..'

అంటున్నాడు గడగడా.

నరహరికెందుకో తను బొంతపురుగుగా మారుతున్న అనుభూతి కల్గింది.

బొంతపురుగు అందమైన సీతాకోకచిలుకగా మారినట్లు తన అకృత్యాలతో మనిషి బొంతపురుగుగా మారుతాడా..?

నరహరి జాఫర్ దిక్కు భయంగా, సిగ్గుగా, శూన్యంగా చూశాడు.

కుంపట్లో ఎదురుగా ఎర్రని నిప్పులు.. కణకణలాడ్తున్నాయి.

●

కథా నిలయం
శ్రీకాకుళం

'సింగిడి' త్రైమాసిక
ప్రారంభ సంచిక-2009